సాక్షి
చిత్తూరు
సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



మహానందీశ్వరుడికి పట్టువస్త్రాలు
మహానందీశ్వర (మహానంది) స్వామికి శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం ఆలయం తరఫున పట్టువస్త్రాలు అందజేశారు. - 8లో



పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు
జిల్లాలో మార్చి 1 నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని డీవీఈఓ సయ్యద్ మౌలా ఆదేశించారు. - 8లో



జల్లికట్టు జోష్
ఎగువ కనికాపురంలో జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు వన్‌టౌన్ పక్కన్న ఉన్న ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

రేపు కాణిపాకంలో ప్రదోష పూజలు

కాణిపాకం : త్రయోదశిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ మణికంతేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు జరగనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ప్రదోష కాలం...ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు రూ.1.16 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి జిల్లాలో ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల చెల్లింపుల కేంద్రాలను తెరిచారు. దీంతో మొత్తం 11,600 మంది వినియోగదారులు బిల్లులు చెల్లించారని చిత్తూరు, తిరుపతి జిల్లాల ట్రాన్స్‌కో ఎస్‌ఈలు ఇస్మాయిల్‌అహ్మద్, సురేంద్రనాయుడు తెలిపారు. తద్వారా రూ.1.16 కోట్లు బిల్లులు చెల్లింపుల ద్వారా వసూలు అయిందని వివరించారు.

మూషిక వాహనంపై గణాధిపుడు



మూషిక వాహనంపై విఘ్నాధిపతి

బంగారుపాళెం : మండలంలోని మొగిలిలో శ్రీ మొగిలీశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం అలంకార మండపంలో విఘ్నాధిపతి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామిని మూషిక వాహనంపై కొలువుదీర్చి ఆలయ మాడవీధులో ఊరేగించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజ, ధర్మకర్త విజయ కుమార్ పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం

మొగిలీశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం కలశస్థాపన, ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాత్రి మండల కరుణీగర్ సంఘం వారిచే హంసవాహన సేవ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

కిక్కిరిసిన కాణిపాకం



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు కిటకిటలాడారు. సెలవు కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఉదయం నుంచే క్యూకట్టారు. ఉచిత, శ్రీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శన క్యూలైన్లు అన్నీ కిక్కిరిశాయి. దర్శనానికి 2గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రకృతి నేస్తాలు

ప్రకృతి నేర్పిన వ్యవసాయాన్ని విస్మరించి సుదూరం ప్రయాణించిన రైతులు మళ్లీ ఆ బాటలోనే సాగడం మొదలుపెట్టారు. **ప్రకృతి వ్యవసాయంలో** కొన్నేళ్లుగా జిల్లా రైతులు అనుసరిస్తున్న పద్ధతుల**ను ఇతర రాష్ట్రాలను** ఆకర్షిస్తోంది. ఎలాంటి రసాయన, పురుగు మం**దులు లేకుండా ఇక్కడి** రైతులు సిద్ధం చేసే కషాయాలు , అస్త్రాలు పంట**ల సాగులో మంచి** ఫలితాలు ఇస్తున్నాయి. ఇక్కడి ప్రకృతి సాగు **ఫలితాలు అక్కడి రైతు**లను అమితంగా ఆకట్టుకుంటోంది. జిల్లాలోని **నగరిలో ఈ పద్ధ**తులు పాటించే యువ రైతులు రాజస్థాన్, మేఘా**లయ, కేరళ రాష్ట్రా**లకు వెళ్లి అక్కడి అన్నదాతలకు అనుభవ పాఠా**లు నేర్పుతున్నారు.** కనుమరుగైన ఆరోగ్యకరమైన పంటల సాగుకు **ఈ ప్రకృతి** నేస్తాలు జీవం పోస్తున్నారు.



కేరళ రాష్ట్రం త్రిచూర్‌లో ఘన జీవామృతం



రాజస్థాన్‌లో భూసారం పెంచే పద్ధతి

అనుభవంతో ఇతరులకు పాఠాలు

జిల్లాకు చెందిన పది మంది యువరైతులు తమ సొంత పొలంలో చూపిన **అనుభవంతో ఇతర రాష్ట్రాలకు** వెళ్లి శిక్షణ అందించే అర్హత పొందారు. రాజస్థాన్, **మేఘాలయ, కేరళ, మధ్యప్రదేశ్** రాష్ట్రాలకు వెళ్లి మన ప్రకృతి వ్యవసాయంపై **అక్కడి రైతులకు అవగాహన** ఏర్పరుస్తున్నారు. నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నా**స్త్రం, వేపాస్త్రం, ఘన జీవామృత**ం, ద్రవ జీవామృతం, వేపాకు కషాయం లాంటి **కషాయాలను, ద్రావణాలను** ప్రత్యక్షంగా తయారుచేసి శిక్షణ అందిస్తున్నారు. **45 రోజుల పాటు అక్కడే ఉ**ండి రైతుల పొలాల్లో ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ **మోడల్, కిచెన్ గార్డెన్, సూర్య** మండలం మోడల్‌లను సిద్ధం చేసి పంటలు సాగు **చేయిస్తూ మన ప్రతి**భను ఇతర రాష్ట్రాల్లో చాటుతున్నారు. నేషనల్ **రూరల్ లైవ్‌లీ** హుడ్ మిషన్ ప్రాజెక్టు వీరికి ఆయా రాష్ట్రాల **భాషపై** తర్ఫీదు ఇచ్చి పంపిండం విశేషం.

- ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తున్న ప్రకృతి వ్యవసాయం
- రాజస్థాన్, మేఘాలయ, కేరళ, మధ్యప్రదేశ్‌కు జిల్లా రైతులు
- అక్కడి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన
- కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్న యువ రైతులు
- ఆసక్తి కనబరుస్తున్న ఇతర రాష్ట్రాల అన్నదాతలు
- ఆరోగ్యకరమైన పంటలకు జీవం



సూర్య మండలం పద్ధతిలో కూరగాయల సాగు



ద్రవ జీవామృతం తయారీ



ఏటీఎం మోడల్‌పై శిక్షణ

నగరి : ప్రకృతి వ్యవసాయంలో జిల్లాలోని నగరికి చెందిన యువ రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా యువత ఈ మార్గాన్ని అనుసరించడంతో మంచి ఫలితాలను సాధిస్తున్నారు. కొన్నేళ్లుగా ఇక్కడి రైతులు ఒకరిని చూసి ఒకరంటూ ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తున్నారు. ఈ పద్ధతిని పాటించే రైతులందరూ 'నేచురల్ ఫార్మర్స్ గ్రూపు' అంటూ ఒక వాట్సాప్ బృందాన్ని ఏర్పాటు చేసుకొని అందులోనే ఎరువుల తయారీపై ఉన్న సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు. ఒకరు తయారు చేసిన అస్త్రాలు, అమృతాలు, కషాయాలు మరొకరు పంచుకుంటూ ఆరోగ్యకరమైన పంటలు సాగు చేస్తూ పలువురికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

ఇక్కడి సాగుపై అధ్యయనం

రాష్ట్రంలో 2023లో ప్రకృతి వ్యవసాయ విధానం ఆదర్శనీయమని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గ్లోబెల్ ఇన్ఫర్మేషన్ షేరింగ్ టూల్‌కిట్ (జిస్ట్) ఇంపాక్ట్ సంస్థ ప్రకటించింది. దీంతో గతేడాది జులై నెలలో ప్రకతి వ్యవసాయంపై అధ్యయనం చేయడానికి రాజస్థాన్ నుంచి విచ్చేసిన బృందం జిల్లాలో పర్యటించింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న పొలాల వద్దకు వెళ్లి సాగవుతున్న పంటలను పరిశీలించి ముగ్ధులయ్యారు. రసాయనాలకు బదులుగా వాడే అస్త్రాలు, అమృతాలు, కషాయాలు, రసాయనేతర విత్తన బ్యాంకు వారిని ఆకట్టుకున్నాయి. ఏటీఎం మోడల్ (అగ్రి ఫుడ్ నేచర్ ట్రాన్సిషన్ మోడల్) లాంటి పంటలు తమ ప్రాంతాల్లోనూ సాగు చేస్తున్నారు.



లైట్‌ట్రాప్‌లో పురుగులు పట్టడంపై అవగాహన

ఆరోగ్యమైన పంట విధానం



నేను కేరళ రాష్ట్రం త్రిచూర్ జిల్లాలో పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నా. 45 రోజుల పర్యటన నిమిత్తం ఇక్కడకు వచ్చాను. రసాయనాలు వాడకుండా ప్రకృతిలో లభించే పేడ, ఆకులు లాంటి వాటితో తయారు చేసే కషాయాలు, ద్రావణాలు వారిని ఆకట్టుకుంటోంది. కిచెన్ గార్డెన్ విధానంపై వారు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరోగ్యకరమైన పంట విధానాలు అక్కడి రైతులను ఆకర్షిస్తోంది.

– రాజ, కృష్ణారామాపురం, నగరి మండలం

సుస్థిర వ్యవసాయంపై శిక్షణ



సాధారణ వ్యవసాయంలో పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించి వ్యవసాయ దిగుబడులు తగ్గకుండా సుస్థిర వ్యవసాయ పద్ధతులను ఎలా వాడాలో రాజస్థాన్, చౌత్‌కా బర్వాడా, గాంధీనగర్‌లో శిక్షణ అందిస్తున్నా. భీజామృతంతో విత్తనశుద్ధి, భూసారాన్ని పెంపొందించడం, భూమిలో సూక్ష్మజీవులను వృద్ధి చేయడానికి ఘన, ద్రవ జీవామృతాలను ఉపయోగించడం, ఉన్న కొంత భూమిలో పలు రకాల పంటలు పండించే విధానాలను రైతులకు ప్రత్యక్షంగా తెలియజేస్తున్నా.

– ఎ.భువనేష్, తెరణి, నగరి మండలం

మంచి ఫలితాన్ని ఇస్తున్నాయి



రాజస్థాన్ రాష్ట్రం, ఉదయపూర్ జిల్లా, సరడా తాహసిల్, జవాద్ గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వివరిస్తున్నా. ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, కిచెన్ గార్డెన్, సూర్య మండలం మోడల్‌ల ప్రత్యక్షంగా సిద్ధం చేసి చూపుతున్నా. ఈ పద్ధతులు మంచి ఫలితాన్ని ఇస్తున్నాయి. పలువురు రైతులు ఈ పద్ధతులపై ఆసక్తి చూపుతున్నారు.

– డి.జనని, గుండ్రాజుకుప్పం, నగరి మండలం

ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నా



ప్రకృతి వ్యవసాయ మెలకువలు నేర్పించడానికి మేఘాలయ రాష్ట్రం, ఈస్ట్ జైంతియా కొండలవద్దకు వెళ్లాను. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వారిని బాగా ఆకర్షించింది. లైట్‌ట్రాప్ పురుగులు పట్టేందుకు వాడే పద్ధతులు, పంట ఎదుగుదలకు ఉపయోగపడే కషాయాలు ప్రకృతిలో దొరికే ఆకులతో ఎలా తయారుచేసుకోవచ్చో వారికి ప్రత్యక్షంగా వివరించడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వారిని అమితంగా ఆకర్షించింది.

– శరత్‌కుమార్, కృష్ణారామాపురం, నగరి మండలం

కషాయాల తయారీ నేర్పుతున్నా



రాజస్థాన్, కందార్ తాసిల్, పలోడిలోని రైతులకు చిన్న పురుగులు నశింపజేసే నీమాస్త్రం ఎలా తయారు చేయాలి, పెద్ద పురుగులు నశింపజేసే బ్రహ్మాస్త్రం ఎలా తయారు చేయాలి. కాండం, కాయతొలుచు పురుగులు నశింపజేసే అగ్నాస్త్రం ఎలా తయారు చేయాలో నేర్పుతున్నా. పలు రకాల కషాయాలు, ద్రావణాల తయారీపై శిక్షణ అందిస్తున్నా. ఏటీఎం మోడల్ వ్యవసాయం నేర్పుతున్నా. రైతులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

– ఉదయకుమార్, కృష్ణారామాపురం, నగరి మండలం

నయవంచన

పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న గ్రూప్-2 అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది





నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్ల కోసం అభ్యర్థుల భవితను ప్రశ్నార్థకం చేసింది. ఏపీపీఎస్సీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకుండా గందగోళ వాతావరణం సృష్టించింది. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై కప్పదాటు ధోరణి అవలంభిస్తూ యువతను అయోమయానికి గురి చేసింది. వాయిదా పేరిట శనివారం అర్ధరాత్రి వరకు యువతను టెన్షన్ పెట్టి నిలువునా వంచించింది. దీంతో చాలామంది ఎగ్జామ్‌కు హాజరుకాలేకపోయారు. వచ్చిన వారు కూడా సక్రమంగా రాయలేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత ఉద్యోగం దక్కుతుందని కోటి ఆశలతో కోచింగ్ తీసుకున్న వారు నిరాశ చెందుతున్నారు. ఇలాంటి దారుణమైన పరిస్థితులు కల్పించిన సర్కారు వ్యవహారశైలిపై మండిపడుతున్నారు.

గ్రూప్-2 మెయిన్స్‌పై ప్రభుత్వం నాటకాలు

- అయోమయం సృష్టించడంతో అభ్యర్థుల అవస్థలు
- రాజకీయ వికృత క్రీడకు బలైన నిరుద్యోగులు
- వాయిదా టెన్షన్‌తో పరీక్ష సరిగా రాయలేక ఇబ్బందులు
- సర్కారు వ్యవహారశైలిపై వెల్లువెత్తుతున్న ఆగ్రహావేశాలు



అభ్యర్థిని తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిరుపతి సిటీ : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఆడిన నాటకానికి జిల్లాలో వేల మంది గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. ఏపీపీఎస్సీ అధికారులు, ప్రభుత్వం మధ్య సమన్వయ లోపం కారణంగా పరీక్ష జరుగుతుందో లేదో అన్న అనుమానంతో శనివారం అర్ధరాత్రి వరకు అభ్యర్థులు మానసికంగా నానా అవస్థలు పడ్డారు. రోస్టర్ విధానంపై స్పష్టత రాకముందే పరీక్షలు నిర్వహించడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కాలేదని అభ్యర్థులు, తల్లిదండ్రులు పలు సెంటర్ల వద్ద గుసగుసలాడుకోవడం కనిపించింది. వాయిదా పడతాయో.. లేక జరుగుతాయో తెలియక ఎంతో మంది అభ్యర్థులు టెన్షన్‌కు లోనయ్యారు. ఆ పరిస్థితుల్లో పరీక్షలను సరిగా రాయలేకపోయామని పలువురు వాపోయారు. ఆదివారం ఈ మేరకు తిరుపతిలోని 13 కేంద్రాలలో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు కేవలం 86 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ, వాయిదా అంటూ అయోమయం, ప్రశ్నపత్రాల సరళిపై గ్రూప్-2 పరీక్ష రాసిన అభ్యర్థులు సాక్షితో పలు అంశాలపై స్పందించారు.



ఆఖరు నిమిషములో కేంద్రంలోకి అనుమతిస్తూ..



పరీక్ష కేంద్రంలోకి పరుగులు తీస్తున్న అభ్యర్థి

ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సింది



గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించి ఉంటే బాగుండేది. పారదర్శకంగా ఉండేదని అభ్యర్థులు అందరూ అభిప్రాయపడుతున్నారు. ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించడం అంత శ్రేయస్కరం కాదనిపిస్తోంది. గతంలో ప్రిలిమ్స్ ఆఫ్‌లైన్‌లో నిర్వహించినా మెయిన్స్ పరీక్ష ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తూ వచ్చారు గ్రూప్-2 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు, అధికారుల హడావుడి ఎక్కువగా అనిపించింది. పరీక్ష కేంద్రానికి సుమారు అర కిలోమీటరు దూరంలో స్టాపింగ్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి నడుచుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి ఉంటే సౌకర్యంగా ఉండేది.

– సువర్ణలత, గ్రూప్-2 అభ్యర్థి, తిరుపతి

సరిగా రాయలేకపోయా



నాతో పాటు ఎంతో మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్ష వాయిదా పడుతుందని ఆశించాం. రోస్టర్ రిజర్వేషన్ స్పష్టత వచ్చేవరకు పరీక్షలు నిర్వహించరని భావించాం. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలపై ఆలోచించకుండా ఏపీపీఎస్సీ పరీక్ష నిర్వహించింది. పరీక్ష వాయిదా పడుతుందని టెన్షన్‌కు గురై సరిగా రాయలేకపోయా. ప్రభుత్వం పోటీ పరీక్షల హాజరవుతున్న అభ్యర్థులను ప్రతిసారీ ఇలా ఆందోళనకు గురిచేస్తోంది. దీనికి తోడు పరీక్ష వాయిదాపై పరిశీలిస్తున్నాం అంటూ మమ్మల్ని వంచించింది. కానీ, ఏపీపీఎస్సీ అందుకు విరుద్ధంగా పరీక్ష నిర్వహణకు పూనుకోవడం దారుణం.

– శ్రీనివాసులు, గ్రూప్-2 అభ్యర్థి, ఎస్వీయూ


అయోమయం సృష్టించారు



గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై అయోమయం సృష్టించారు. రూ.లక్షలు వెచ్చించి శిక్షణ తీసుకున్నాం. పరీక్ష జరుగుతుందో లేదో తెలియక శనివారం అర్ధరాత్రి వరకు టెన్షన్ పడ్డాం. రోస్టర్ పద్ధతిపై పలు మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఏపీపీఎస్సీ అధికారులు, ప్రభుత్వం మధ్య అవగాహ లేకపోవడంతో గందరగోళం సృష్టించారు. ఇలా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం దారుణం. పరీక్షల్లో ఏపీ చరిత్ర, ఇండియన్ ఎకానమీ ప్రశ్నపత్రాలు పర్వాలేదు, కానీ, రెండో సెషన్‌లో జరిగిన ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రశ్న పత్రంతో ఇబ్బంది పడ్డాం.

– వినోద్, గ్రూప్-2 అభ్యర్థి, ఎస్వీయూ

స్పష్టత రాకుండానే పరీక్షలు



గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వివాదాస్పదమవడానికి ప్రధాన కారణం రోస్టర్ విధానం అమలులో స్పష్టత రాకపోవడం. మాలాంటి పేద విద్యార్థులందరం ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కొన్నేళ్ల పాటు పుస్తకాలకు అత్తుకుపోయి శ్రమించాం. అలాంటిది ప్రభుత్వం రోస్టర్ రిజర్వేషన్‌పై స్పష్టత ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం దారుణం. పరీక్షలు నిర్వహించారు కానీ రిజల్ట్ విడుదల, పోస్టింగ్‌ల విషయంలో వాయిదాలు వేయకుండా ఏపీపీఎస్సీ సక్రమంగా నిర్వహిస్తుందా అన్నది అనుమానంగా ఉంది.

– ఉమేష్, గ్రూప్-2 అభ్యర్థి, తిరుపతి

పేద విద్యార్థులకు నష్టమే



పారదర్శకతతో గ్రూప్-2 ఉద్యోగాలకు రోస్టర్ విధానం అమలు చేసి తీరాల్సిందే. లేదంటే పేద విద్యార్థులకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. రోస్టర్ విధానంపై స్పష్టత వచ్చిన తర్వాత గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించి ఉంటే బాగుండేది. ఆదివారం జరిగిన పరీక్ష ప్రశ్న పత్రం శైలి చాలా సులువుగా సాధారణ విద్యార్థి సైతం జవాబులు గుర్తించే విధంగా ఉంది. ఎకనామిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీలో బేసిక్ ప్రశ్నలు అధికంగా వచ్చాయి. పేపర్ సులువుగా ఉన్నప్పటికీ రోస్టర్ అమలు చేస్తేనే అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరుగుతుంది.

– షణ్ముగం, గ్రూప్-2 అభ్యర్థి, తిరుపతి

మహానందీశ్వరుడికి పట్టువస్త్రాలు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నుంచి మహానందిలోని మహానందీశ్వర స్వామికి ఆదివారం పట్టువస్త్రాలు అందజేశారు. అక్కడ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామి వారికి ఈఓ పెంచల కిషోర్ దంపతులు, ఆలయ అర్చకులు కలిసి ఊరేగింపుగా వెళ్లి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. అక్కడి ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలు చేసి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో మధు, సిబ్బంది శ్రీనివాస్, కోదండపాణి, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్ అరెస్టు


కారు డ్రైవర్ నరేంద్రను అరెస్టు చూపుతున్న పోలీసులు

బంగారుపాళెం : రోడ్డు ప్రమాదంలో విద్యార్థుల మృతికి కారకుడైన కారు డ్రైవర్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 18వ తేది రాత్రి మండలంలోని ఆర్‌ఆర్‌నగర్ వద్ద కారు ఢీకొన్న ప్రమాదంలో కరిడివారిపల్లెకు చెందిన గౌతం, తగ్గువారిపల్లెకు చెందిన గణేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వెలుతురుచేను గ్రామానికి చెందిన నరేంద్రను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మణి (ఫైల్)

వి.కోట : అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని యాలకల్లు పంచాయితీ వైసీ బండపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వైసీ బండపల్లికి చెందిన నారాయణప్ప కుమారుడు మణి (42) తన పొలానికి నీళ్లు పారించేందుకు శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లాడు. ఆపై ఉదయం అయిన ఎంతసేపటికి ఇంటికి తిరిగి రాలేదు. పక్క పొలం వారికి తన భర్త మణి ఆచూకీ కనుక్కోవాలని భార్య సూచించడంతో వారు వెళ్లి ఆరా తీశారు. మణి అప్పటికే అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్తుల సాయంతో అతడిని అస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మణి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పొలం వద్ద జారిపడి మృతి చెందాడా? లేక ఇతర కారణాలతో మృతి చెందాడా ? అనే విషయంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన మణికి భార్య, కుమారుడు ఉన్నారు.

అమ్మకు ఆపద

వైద్యరంగంలో విప్లవాత్మకమైన వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చినా జిల్లాలో మాతృ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎక్కువగా తల్లి కడుపులో పెరుగుతున్న బిడ్డ, నవ మాసాలు మోసే తల్లికి పోషకాహారం అందడం లేదు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పేదరికం కారణంగా కుటుంబానికి అందజేస్తుండడం ఫలితంగా తల్లులు రక్తహీనత, తదితర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. సకాలంలో వైద్యసేవలు, సూచనలు, సలహాలు పొందడంలో అవగాహన లేకపోవడంతో మాతా శిశు మరణాలు సంభవిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

- జిల్లాలో తల్లులను వేధిస్తున్న రక్తహీనత
- 60 శాతానికి పైగా సమస్య
- హైరిస్క్‌లో గర్భిణులు
- ఆపై తల్లితో పాటు బిడ్డకు ప్రమాదం
- వెంటాడుతున్న నిర్లక్ష్యం
- ఆరోగ్య సూత్రాలు పాటించని గర్భిణులు
- హెచ్చరిస్తున్న వైద్య నిపుణులు


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లులు


చికిత్స కోసం వరుసలో నిరీక్షిస్తున్న గర్భిణులు

కాణిపాకం : తల్లులు పండంటి బిడ్డకు జన్మనివ్వాలని కలలు కంటుంటారు. సురక్షితంగా ప్రసవం జరిగి.. బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటారు. అయితే కాబోయే తల్లుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. కౌమారదశ నుంచి తల్లులను ఈ రక్తహీనత వేధిస్తోంది. పౌష్టికాహార లోపమే శాపంగా మారి.. చాలా మంది గర్భిణులను రక్తహీనత సమస్య వేధిస్తోంది. మాతా, శిశువులను కబళిస్తోంది. ఇలాంటి తరుణంలో తల్లులు అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. వీటి కట్టడిలో నిర్లక్ష్యం వెంటాడుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

జిల్లాలో ప్రతి రోజూ వందకు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. వీరితో పాటు గర్భం దాల్చిన వారు రెగ్యులర్ చెకప్ కోసం మరో 2 వేల మందికి పైగా వస్తుంటారు. వీరిలో 50 నుంచి 60 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. వీరిలో చికిత్స కోసం వచ్చిన వారికి అవసరమైన మందులు సూచించి, పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. ప్రసవం కోసం వచ్చిన వారికి మాత్రం రక్తం తక్కువైతే అప్పటికప్పుడు బ్లడ్ బ్యాంకులో అవసరమైన రక్తాన్ని తెప్పించి ఎక్కించి ప్రసవం చేస్తుంటారు. తీవ్ర రక్తస్రావంతో ప్రసవానికి వచ్చిన కొందరు కోలుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతినెలా ప్రాణాపాయ స్థితిలో రక్తహీనత ఉన్న గర్భిణుల కేసులు 40 నుంచి 50 దాకా వస్తుంటాయి. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు వైద్య ఆరోగ్యశాఖ , వైద్య విధాన పరిషత్ పరిధిలోని కేంద్రాలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ ఇప్పటికీ చాలా మంది గర్భిణులు తీవ్ర రక్తహీనతతో కన్నుమూయడం ఆందోళన కలిగిస్తోంది.

– పలమనేరుకు చెందిన ఓ బాలిక ఇటీవల తల్లి అని బయటపడింది. రక్తహీనత లోపం కారణంగా ప్రాణం మీదకు తెచ్చుకుంది. 4 గ్రాముల రక్తం ఉండడంతో ఆస్పత్రి పాలైంది. పిట్స్ రావడంతో జిల్లా ఆస్పత్రికి చేరిన ఆ బాలికకు ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు. 6 నెలల బిడ్డ ప్రస్తుతం ఐసీయూలో ఉండగా.. బిడ్డను ప్రసవించిన కొద్ది గంటల్లోనే తల్లి మృతి చెందింది. ఈ మృతికి ప్రధాన కారణంగా రక్తహీనత లోపంగా వైద్యులు గుర్తించారు. రక్తం తక్కువగా ఉండడంతో ఊపిరితిత్తులకు ఉమ్మ నీరు చేరడం మృతికి కారణమైందని వైద్యులు నిర్ధారించారు.

తీవ్ర రక్తహీనత..

గత 8 నెలల కాలంలో 27,378 మంది గర్భిణులుగా నమోదయ్యారు. ఇందులో అధికంగా టీనేజీ గర్భిణులు 2,793 మందిని గుర్తించారు. అనధికారికంగా మరో 900 మంది ఉండవచ్చునని అధికారుల అంచనా. కాగా నమోదైన మొత్తం గర్భిణుల్లో 80 శాతం మందికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు అధికారుల గణంకాలు చెబుతున్నాయి. కానీ వాస్తవ పరిస్థితులను గమనిస్తే జిల్లా వ్యాప్తంగా నమోదైన 27,378 మంది గర్భిణుల్లో 60 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఒక్క జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని గైనిక్ ఓపీకి వస్తున్న గర్భిణుల్లో 50 నుంచి 60 శాతం మందికి హెచ్‌బీ 10 నుంచి 6 గ్రాముల్లోపు ఉంటోందని వైద్యులు పేర్కొంటున్నారు.

పౌష్టికం పక్కదారి...

గర్భిణుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వాలు పౌష్టికం ఉన్న పదార్థాలను అందజేస్తోంది. అయితే అవి పక్కదారి పడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఇక అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే కోడిగుడ్లు, చిక్కీలు, కంది పప్పు, బెల్లం తదితర పోషకాహార పదార్థాలను అధిక శాతం గర్భిణులు ఇళ్లకు తీసుకెళ్లి ఇంటిల్లి పాదికి వాడుకుంటున్నారు. ఈ కారణంగా గర్భిణులకు సరైన పోషకాహారం అందడం లేదన్నది బహిరంగ రహస్యం.

ఏం చేయాలంటే...

హిమోగ్లోబిన్ శాతం 8 నుంచి 10 గ్రాములు ఉంటే కొంచెం రక్తహీనతగా 6 నుంచి 8 గ్రాములుంటే మధ్యస్తంగా 6 కంటే తక్కువగా ఉంటే మాత్రం దానిని వైద్యులు తీవ్రంగా పరిగణిస్తారు. 8 నుంచి 10 శాతం ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, 6 నుంచి 8 గ్రాములు ఉన్న వారు ఐరన్ సుక్రోజ్ ఇన్ఫ్యూజన్ ఇంజెక్షన్లు ఇస్తారు. 6 కంటే తక్కువ ఉన్న వారికి మాత్రం రక్తం ఎక్కిస్తారు. గర్భిణికి మూడో నెల గర్భం నుంచి తప్పనిసరిగా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా వాడాలి. లేకపోతే వారు తీవ్ర రక్తహీనతకు చేరి తల్లీ బిడ్డలిద్దరికి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలోని ఆస్పత్రుల వివరాలు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి	1
ఏరియా ఆస్పత్రులు	4
సీహెచ్‌సీలు	8
పీహెచ్‌సీలు	50
అర్బన్‌హెల్త్ సెంటర్లు	15
ప్రైవేటు ఆస్పత్రులు	1500

మాతా శిశుమరణాల వివరాలు..

సంవత్సరం	శిశు మరణాలు	మాతృ మరణాలు	ఎంఎంఆర్
2022-23	196	9	31
2023-24	153	8	31.2
2024-25	100	8	41

జిల్లాలో రక్తహీనత లోప వివరాలు..

జిల్లాలో ప్రస్తుతం ప్రెగ్నెంట్ పరీక్షలు చేసుకున్నవారు	13749
గర్భిణులుగా నమోదైన వారు	9754
అంగన్‌వాడీ కేంద్రాలకు మ్యాపింగ్ చేసిన గర్భిణుల సంఖ్య	8652
హెచ్‌బీ పరీక్షలు చేసుకున్న వారు	6835
రక్తం సాధారణ స్థితిలో ఉన్నవారు	3283
మధ్యస్థ స్థాయిలో	2656
తక్కువ రక్తం ఉన్నవారు	896

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



కౌమార దశ నుంచి ఆరోగ్యంపై బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి. ఆరోగ్య విషయాల్లో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. టీనేజీ వయస్సులో పిల్లలకు వివాహలు చేయకూడదు. ముఖ్యంగా గర్భిణులు సకాలంలో పేరు నమోదు చేసుకోవాలి. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. ఐరన్, సుక్రోజ్ మందులు, మాత్రలను విధిగా వాడాలి. దీనికి తోడు ఆకు కూరలు, ఇతర పౌష్టికం ఉన్న పదార్థాలను తీసుకోవాలి. లేకుంటే హైరిస్క్‌లో పడుతారు. రక్తహీనత కారణంగా తల్లితో పాటు బిడ్డకు ప్రమాదం ఉందనే విషయాన్ని గుర్తించాలి. డాక్టర్లు ఇచ్చే ఆరోగ్య సూత్రాలను పాటించాలి.

– ప్రభావతి, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గర్భం దాల్చిన వెంటనే అంగన్‌వాడీ కార్యకర్త వద్ద రిజిస్టర్ కావాలి
- కేంద్రం నుంచి వచ్చే వాటితో పాటు వైద్యులు సూచించే ఆహార పదార్థాలు తీసుకోవాలి.
- గర్భ నిర్ధారణ సమయంలో ఒక టీటీ ఇంజెక్షన్, నెల తరువాత మరొక్కటి వేసుకోవాలి
- నాలుగుసార్లు తనిఖీలు తప్పనిసరి. ఆయా సమయాల్లో బీపీ, రక్త, మూత్ర పరీక్షలు విధిగా చేయించుకోవాలి.
- పగటిపూట కనీసం రెండు గంటల పాటు విశ్రాంతి అవసరం.
- స్వచ్ఛమైన గాలి, అవసరం మేరకు వ్యాయామం, నీళ్లు తాగడం
- అధిక బరువు ఎత్తకూడదు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

– సమావేశంలో డీవీఈవో సయ్యద్ మౌలా


సమావేశానికి హాజరైన డిపార్ట్‌మెంట్ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ జిల్లా డీవీఈవో సయ్యద్ మౌలా అన్నారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణపై ఆదివారం పీసీఆర్ ప్రభుత్వ కళాశాలలో చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో కీలకమైన చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు నిబద్ధతతో పనిచేసి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకే చేరుకునేలా సూచనలివ్వాలన్నారు. పరీక్షల స్పెషల్ ఆఫీసర్ దయానందరాజు మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన డెస్క్‌లు, తాగునీటి వసతి, ఇతర సౌకర్యాలు నిర్వహించాలన్నారు. పరీక్షల పర్యవేక్షణకు 5 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 5 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. డీఈసీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ.. పరీక్షలకు ముందు ప్రశ్నపత్రాలను తరలించడం, పరీక్షల తర్వాత జవాబు పత్రాలను తరలించే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రశ్నపత్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్రవాహనాల్లో తీసుకెళ్లకూడదని ఆదేశించారు. సమావేశంలో డీఈసీ సభ్యులు హేమలత, శరత్ చంద్రశేఖర్, నిర్మల కుమారి, రియాజ్, చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

బోయకొండకు భక్తుల దండు



అలంకరణలో అమ్మవారు, బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

– సుమారు 20 వేల మంది భక్తులకు దర్శనం

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మతల్లి దీవెనల కోసం భక్తులు బోయకొండకు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. సెలవు దినం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, యువత బోయకొండకు రావడంతో ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఆలయంలోని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారని అధికారులు వెల్లడించారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లలో భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

సారా విక్రేతల అరెస్టు

– 60 లీటర్ల సారా స్వాధీనం

చౌడేపల్లె : వివిధ ప్రాంతాలలో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని పక్షరాజపురానికి చెందిన నక్కల అంజి ఇంటి సమీపంలోని పొలంలో 40 లీటర్ల నాటుసారాను విక్రయిస్తుండగా ఆదివారం పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. అలాగే దుర్గసముద్రం పంచాయతీ చిన్నాగనపల్లెలో బంగిరాజప్ప సారా విక్రయిస్తుండగా పట్టుకొని అతడి వద్ద గల 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని పలు పేకాట స్థావరాలపై ఆదివారం టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. సంతపేట పాంచాలిపురంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే తేనేబండ పరిసర ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.2,500 పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

పుంగనూరు : మండలంలోని ఉలవలదిన్ని పొలాల్లో పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.4 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. సమాచారం మేరకు ఉలవలదిన్ని పొలాల్లో దాడులు చేసి, పేకాట రాయుళ్లను పట్టుకుని, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.



భవుని వైభవం

- కనులపండువగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- విశేష వాహనాలపై విహరించిన ఆది దంపతులు

శ్రీకాళహస్తి : దక్షిణ కైలాసంలో అంగరంగ వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరస్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరంపై అధిష్టించి లయకారుని వెంట సాగారు. మూషిక వాహనంపై విఘ్నేశ్వరుడు, చప్పరాలపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. మంగళ వాయిద్యాలు, కోలాటాలు, భజనల నడుమ ఆదిదంపతులు పురవిహారం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే రాత్రి సర్వాలంకారశోభితులైన ఆదిదంపతులు చంద్రప్రభ, శుక వాహనాలపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగారు. కార్యక్రమాల్లో ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

మూడు కౌంటర్లలో టికెట్ల విక్రయం

మహాశివరాత్రి రోజున స్వామివారి దర్శనానికి స్థానికుల కోసం మూడు కౌంటర్లలో టికెట్లు విక్రయించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. పట్టణంలోని భక్తకన్నప్ప సదన్, శ్రీప్రసన్న వరదరాజస్వామి అతిథిగృహం, సీఆర్‌ఓ కార్యాలయంలో ఒక్కో రూ.200 చొప్పున 24న ఉదయం 6 నుంచి రాత్రి 7గంటల వరకు, 25న ఉదయం 6 నుంచి సాయంత్రం 5గంటల వరకు విక్రయిస్తారని వెల్లడించారు. భక్తులు ఆధార్ కార్డు అందించి ఆయా కౌంటర్లలో టికెట్లు తీసుకోవచ్చని సూచించారు.



నేడు రావణాసుర – మయూర వాహనసేవలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రావణబ్రహ్మ వాహనంపై ముక్కంటీశుడు, మయూర వాహనంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు పురవీధుల్లో విహరించనున్నారు. ఈ క్రమంలోనే9 ఉదయం పరమశివుడు హంసవాహనం, పార్వతీదేవి యాళి వాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నారు.


సూర్యప్రభ వాహనంపై స్వామి, చప్పరంపై అమ్మవార్ల ఊరేగింపు



పరుగులు తీస్తున్న కోడె గిత్తలను నియంత్రించేందుకు పోటీ పడుతున్న యువకులు

- ఎగువ కనికాపురంలో ఎడ్ల పందాలు

వెదురుకుప్పం : ఉత్సాహం ఉరకలేసింది...కాలు దువ్విన కోడె గిత్తలు... జనసమూహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయిన పోట్ల గిత్తలు తమ పౌరుషాన్ని చూపాయి. ఎడ్ల వేగాన్ని నియంత్రించలేక యువత ప్రేక్షకపాత్ర వహించారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా ఆదివారం మండలంలోని ఎగువకనికాపురంలో జరిగిన జల్లికట్టు జోష్ తెచ్చింది. నిర్వాహకులు ముందుగా ఎడ్లకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్‌లు కట్టి పందానికి సిద్ధం చేశారు. పలకల కోసం అల్లి వద్ద సిద్ధంగా యువత నిలబడడంతో నిర్వాహకులు ఎడ్లను ఉసిగొల్పారు. పరుగులు తీస్తున్న ఎడ్లను యువత కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. ఉత్సాహంతో పందెంలో పాల్గొన్న యువత పరుగులు తీస్తున్న కోడె గిత్తలను కట్టడి చేసి పలకలను లాక్కొన్నారు. పలకలు పట్టిన యువత విజయ దరహాసంతో చిందులు వేశారు. పశువుల కింద పడి కొందరికి గాయాలయ్యాయి.